సాక్షి తిరుపతి

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



బొజ్జలా..దేవుడు క్షమించడు

ఏనాడూ బొజ్జల కుటుంబం నీలకంఠేశ్వర ఆలయాన్ని పట్టించుకోలేదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. - 8లో



31 కేసుల నమోదు

తూనికలు, కొలతల శాఖల అధికారులు గురువారం తిరుపతిలో దాడులు చేసి 31 కేసులు నమోదు చేశారు. - 8లో



తిరుపతిలో గంజాయి స్వాధీనం

తిరుపతిలో ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన వెలుగుచూసింది. - 8లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి శ్రీగోవిందరాజ స్వామి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 17వ తేదీ శనివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు వారం రోజుల పాటు స్వామివారి తెప్పోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారు దేవేరులతో కలిసి శ్రీగోవిందరాజ పుష్కరిణిలో తెప్పలపై కొలువై విహరించనున్నారు. తర్వాత ఆలయ మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. తెప్పోత్సవాల్లో భాగంగా తొలి రోజు శనివారం శ్రీకోదండరామస్వామి వారు, 18న శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీపార్థసారథి స్వామి వారు, 19న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారు, 20న ఆండాళ్ అమ్మవారితో కలిసి శ్రీకృష్ణస్వామి వారు తెప్పలపై విహరిస్తూ భక్తులను కనువిందు చేయనున్నారు. అలాగే 21, 22, 23 తేదీల్లో శ్రీగోవిందరాజస్వామి వారు తెప్పలను అధిరోహించి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. చివరి రోజు తెప్పోత్సవం అనంతరం ఎదురు ఆంజనేయస్వామివారి సన్నిధికి స్వామివారు వేంచేపు చేస్తారు.

3డీ ప్రింటింగ్‌పై అవగాహన



విద్యార్థులకు 3డీ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ వెంకటేష్

తిరుపతి సిటీ : పద్మావతీ మహిళా వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీపై బుధవారం వర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రధాన వక్తగా రాజంపేట అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వి వెంకటేష్ హాజరై ఎమ్.ఫార్మసీ విద్యార్థులకు ఆధునిక 3డీ ప్రింటింగ్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.శైలజ, ఎం.విద్యావతి, డి.సుజాత, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ నియామకం

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పలు విభాగాల కమిటీ సభ్యులను నియమించారు. రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ ఉపాధ్యక్షులుగా బీ.నరహరిరెడ్డి(తిరుపతి), ప్రధాన కార్యదర్శిగా జీఎస్‌కే.విజయభాస్కర్‌రెడ్డి(తిరుపతి), కార్యదర్శులుగా ఐ.చంద్రశేఖర్‌రెడ్డి(తిరుపతి), కేఎస్.రవీంద్రన్ (చిత్తూరు), జాయింట్ సెక్రటరీలుగా వీ.శ్రీనివాసులు(తిరుపతి), సీ.విశ్వనాథరెడ్డి(చిత్తూరు) నియమితులయ్యారు. అలాగే ఎస్టీసెల్ ప్రధాన కృదర్శిగా గూడూరు మార్కొండయ్య(చిత్తూరు), కార్యదర్శిగా బీ.చిన్నరాజునాయక్(చిత్తూరు), పీ.రోహిత్‌సాయి(తిరుపతి), జాయింట్ సెక్రటరీలుగా హరిప్రసాద్‌నాయక్(తిరుపతి), కావడి నాగరాజు (చిత్తూరు), వైఎస్సార్‌సేవాదళ్ కమిటీ జాయింట్ కార్యదర్శిగా తోటి వెంకటరత్నం(చిత్తూరు) నియమితులయ్యారు.

శ్రీకాళహస్తి ఈవోగా ఎస్‌వీ నాగేశ్వరరావు



శ్రీకాళహస్తి: దక్షిణ కాశీ గా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా గురువారం ఎస్‌వీ నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. అక్కడే నాగేశ్వరరావు ఈవోగా బాధ్యతలు స్వీకరించారు.





మినీ బ్రహ్మోత్సవం..

చూసి తరిద్దాం

- తిరుమలలో నేడు సప్తవాహనాలపై ఊరేగనున్న శ్రీవారు
- రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం రథసప్తమి పర్వదినానికి టీటీడీ సర్వం సిద్ధం చేసింది. శ్రీవారి ఆలయంతోపాటు అన్నప్రసాదం, నిఘా, భద్రత, ఇంజినీరింగ్, ఉద్యానవన తదితర విభాగాల్లో భారీ ఏర్పాట్లు చేపట్టింది. సప్త వాహనాలపై స్వామివారి వైభవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయనుండడంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు పూర్తిచేసింది. శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున కైంకర్యాలు పూర్తయిన అనంతరం ఉదయం 4.30 గంటలకు శ్రీమలయప్ప స్వామి వారు ఆలయం నుంచి వాహన మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ విశేష సమర్పణ చేపడతారు.

సూర్యప్రభ వాహనం

ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనసేవ మొదలవుతుంది ఆలయ వాయువ్య దిశకు చేరుకోగానే సూర్యోదయాన భానుడి తొలి కిరణాలు శ్రీ మలయప్పస్వామివారి పాదాలను స్పర్శిస్తాయి. ఈ ఘట్టం భక్తులకు కనువిందు చేస్తుంది.

చిన్నశేషవాహనం

ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ వాహన సేవ మొదలవుతుంది. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకిగా భావిస్తారు.

గరుడ వాహనం

ఉదయం 11 నుంచి 12 గంటల వరకు గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. ఇది శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది. ఈ సేవలో తరిస్తే సర్వపాపవిముక్తి కలుగుతుందని ప్రతీతి.

హనుమంత వాహనం

మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహన సేవ ఉంటుంది. శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తాడు.

చక్రస్నానం

చక్రస్నానం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు శ్రీవరాహస్వామివారి ఆలయం వద్ద ఉన్న స్వామిపుష్కరిణిలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేస్తారు.

కల్పవృక్ష వాహనం

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉభయ దేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై స్వామి వారు మాడ వీధుల్లో విహరించనున్నారు.

సర్వభూపాల వాహనం

సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ వాహన సేవ ఉంటుంది. సర్వభూపాల అంటే విశ్వానికే రాజు అని అర్థం. అంటే శ్రీవారు సకల దిక్పాలకులకు రాజాధిరాజని భావం.

చంద్ర ప్రభ వాహనం

ఈ వాహన సేవ రాత్రి 8 నుంచి 9 గంటల వరకు ఉంటుంది. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండటం విశేషం.

650 మంది పోలీసులతో భద్రత



తిరుపతి (అలిపిరి): భక్తుల భద్రతే పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ మల్లికా గార్గ్ సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఆమె గురువారం పోలీసులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రథసప్తమి సందర్భంగా శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొత్తం 650 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. క్రమశిక్షణతో దురుసుగా లేకుండా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఎస్పీ శ్రీవారి వాహన మండపం, మాడ వీధులు, పుష్కరిణి, గ్యాలరీలు, ఎంట్రీ ఎగ్జిట్ గేట్లు, పార్కింగ్ ఏరియాలు, ఇన్నర్ అవుటర్ రింగ్ రోడ్లను పరిశీలించారు.

ముస్తాబైన తుమ్మలగుంట



రథసప్తమి వేడుకల్లో భాగంగా విద్యుత్ దీపాలంకరణలో తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న ఆలయం

- ఏడు వాహనాలపై ఊరేగనున్న కల్యాణ వెంకన్న
- చక్రస్నానానికి సిద్ధమైన పుష్కరిణి
- ప్రత్యేక పుష్పాలంకరణతో స్వామి వారి దర్శనం



స్వామి వారి వాహనాలను సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

తిరుపతి రూరల్ : ఒక రోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి వేడుకలకు తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం ముస్తాబవుతోంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంటలో ఈ నెల 16వ తేదీ శుక్రవారం రథ సప్తమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. ఏడు వాహనాలపై విహరించే స్వామి వారి రథసప్తమి వేడుకలను మినీ బ్రహ్మోత్సవాలుగా పిలవడం పరిపాటి. సూర్య జయంతి పర్వదినాన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు సప్త వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. ఇప్పటికే ఆలయంతోపాటు పుష్కరిణి పరిసరాలను శుభ్రం చేసిన ఆలయ సిబ్బంది ప్రత్యేక పుష్పాలతో గర్భాలయాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచే వాహన సేవలు ప్రారంభం అవుతుండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు అన్నీ పూర్తి చేశారు.

వాహనసేవలు ఇలా

ఈనెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్న శేష వాహనం, 11 నుంచి 12 గంటల వరకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం, మధ్యాహ్నం 2 గంటలపైన చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై స్వామి వారు ఊరేగుతారు.

ఇలా సప్త వాహనాలపై ఒక్క రోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి వేడుకలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానుండడంతో అందుకు తగిన విధంగా భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు.

బోయకొండకు గుర్తింపు తీసుకొస్తాం



బోయకొండ వనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

చౌడేపల్లె: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న బోయకొండ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవడమే లక్ష్యమని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం బోయకొండ గంగాపురంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.3 కోట్ల వ్యయంతో సుమారు 11 హెక్టార్లలో ఏర్పాటు చేసిన బోయకొండ వనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్పతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో బోయకొండలో ముప్పై ఏళ్లలో చేయాల్సిన అభివృద్ధిని ఈ నాలుగున్నరేళ్లలో చేశామన్నారు. గత పాలకులకు బోయకొండను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బోయకొండ గంగాపురంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకునేలా వనం నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడా పార్కును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి స్థానిక నేతలతో కలిసి మొక్కలు నాటారు.

అమ్మవారి ప్రసాదాల అందజేత..

బోయకొండ గంగమ్మ అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి, ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటా చలపతి, ఎంపీపీ రామ్మూర్తి, మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూపి ఓట్లు అడుగుతున్నాం

పుంగనూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసి, అలాగే చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడిగేందుకు ప్రజల్లోకి ధైర్యంగా వెళ్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన మున్సిపాలిటీలో రూ.5.90 కోట్లతో నిర్మించిన సోలార్ విద్యుత్ ప్రాజెక్టును, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు.

సేవలకు సలాం

- అవినీతి మరక అంటని వలంటీర్ వ్యవస్థ
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



వలంటీర్‌ను సన్మానిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: వలంటీర్లు పేదలకు అందిస్తున్న సేవలకు సలాం చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డెప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం వలంటీర్లకు వరుసగా నాలుగోసారి ప్రతిభా పుర్కసారాలను ప్రదానం చేశారు. ముందుగా గుంటూరు జిల్లా ఫిరంగిపురం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన డెప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సంక్షేమ ఫలాలను పేదలకు అందిస్తున్న గొప్పవారు వలంటీర్లంటూ కొనియాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పేదలకు పెద్ద సాయం చేయడానికి మన రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే అంచనాలకు మించి వలంటీర్లు సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడా చిన్నపాటి అవినీతి మరక లేకుండా వలంటీర్లు పనిచేస్తున్నారని చెప్పారు. తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ వలంటీర్లు నిస్వార్థ సేవకులుగా అభివర్ణించారు. మానవతాదృక్పథంతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని పేదల ఇంటికి చేర్చడంలో వంద శాతం సక్సెస్ అయ్యారని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు చేసిన సేవలకు రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎప్పుడూ వలంటీర్లకు అండగా ఉంటుందని చెప్పారు. మరింత సేవ చేయడానికి కృషి చేయాలని కోరారు. కలెక్టర్ జి.లక్ష్మీ శ మాట్లాడుతూ జిల్లాలో 691 వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో 11,875 మంది వలంటీర్లకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సేవా వజ్ర 37 మందికి, సేవా రత్న 216 మందికి, సేవా మిత్ర 11,413 మందికి, టెస్టిమోనియల్స్ 48 మందికి, మొత్తం 11,666 మందికి అభినందన పురస్కారాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి సుశీలాదేవి, డెప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న వలంటీర్

జిల్లాలో వలంటీర్లకు వచ్చిన అవార్డుల వివరాలు ఇలా

సేవా వజ్ర– రూ 45 వేలు –35 మందికి

సేవా రత్న– రూ.30 వేలు –216 మందికి

సేవా మిత్ర– రూ.15వేలు –11,413 మందికి

వలంటీర్ల గౌరవం నిలబెట్టేలా..



“ రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందజేస్తున్న ప్రతిభ పురస్కారాలు వలంటీర్ల గౌరవాన్ని నిలబెట్టేలా ఉన్నాయి. వరుసగా నాలుగో సారి అవార్డులు ఇచ్చారు. అవార్డు మొత్తాన్ని గత ఏడాదితో పోల్చుకుంటే 50శాతం పెంచారు. పేదలకు సేవలు చేయడం దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నాం. ఈ అవకాశం ఇచ్చిన జగనన్నకు రుణపడి ఉంటాం. – కన్నలి స్వాతి, సేవావజ్ర అవార్డు గ్రహీత, కన్నలి, తొట్టంబేడు మండలం

మహనీయుల పేర్లతో ఆధ్యాత్మిక శోభ

- అంతర రహదారుల అభివృద్ధితో విస్తరణ దిశగా తిరుపతి
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



అచ్యుత రాయలు మార్గాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: తిరుపతిలోని నూతన రహదారులకు శ్రీవారి తొలి సేవకులు, ఇతర పుణ్యమూర్తుల పేర్లను నామకరణం చేయడంతో నగరానికి మరింత ఆధ్యాత్మిక శోభ చేకూరిందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. అలిపిరి రోడ్డు నుంచి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ మీదుగా చెన్నారెడ్డి కాలనీ, ఓల్డ్ మెటర్నటీ రోడ్డును కలుపుతూ నూతనంగా అభివృద్ధి చేసిన అచ్యుత దేవరాయ మార్గాన్ని ప్రారంభించారు. దీనికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి గురువారం మేయర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ తిరుపతి నగరానికి మరింత ఆధ్యాత్మిక శోభ తీసుకురావాలన్న సంకల్పంతో ఇటీవల అభివృద్ధి చేసిన రహదారులన్నింటికీ శ్రీవారి ప్రచారకులు, ఎందరో పుణ్యమూర్తులు, మహనీయుల పేర్లతో నామకరణం చేస్తున్నామని చెప్పారు. చంద్రగిరి సంస్థానాన్ని పాలిస్తూ వేంకటేశ్వర స్వామికి అనేక సేవలు చేసిన అచ్యుత దేవరాయల పేరును కొత్త రహదారికి నామకరణం చేశామన్నారు. నూతన రహదారులతో తిరుపతి నగర విస్తరణకు అడుగులు పడ్డాయని చెప్పారు. కేవలం నాలుగేళ్లలోనే మాటల్లో కాకుండా, చేతల్లో అభివృద్ధిని చేసి చూపించామన్నారు.

తిరుపతి నగరంలో దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు తెర దించుతూ 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేశామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి చెప్పారు. ఆరు ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్‌ను విస్తరించి ట్రాఫిక్ సమస్యను అధిగమించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడం ద్వారా తిరుపతిని ప్రపంచ స్థాయి నగరంగా ఆవిష్కరించేందుకు దోహదపడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈఈ విజయ కుమార్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, బస్వా గీత, పునీత, నరేంద్రనాథ్, తిరుపతి మునిరామిరెడ్డి, గంగమ్మ గుడి ఆలయ చైర్మన్ కట్టా గోపి యాదవ్, పార్టీ నాయకులు తలారి రాజేంద్ర, బాలిశెట్టి కిశోర్, బస్వా బాలసుబ్రమణ్యం, దేవదానం, దినేష్ రాయల్ పాల్గొన్నారు.

అట్టల ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం


ఫ్యాక్టరీలో దగ్ధమవుతున్న అట్టలు

రేణిగుంట: పట్టణంలోని పాంచాలి నగర్‌కు సమీపంలో ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీవారి ప్యాకింగ్ సొల్యూషన్ అట్టల ఫ్యాక్టరీలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. తెల్లవారుజామున అకస్మాత్తుగా ఫ్యాక్టరీలో నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు రావడంతో వాచ్‌మెన్ యాజమాన్యానికి తెలిపారు. దీంతో యజమాని పవన్‌కుమార్ అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. వెంటనే అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ కర్మాగారంలో 20మంది సిబ్బంది పగటిపూట మాత్రమే పని చేస్తుండడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రూ.2కోట్లకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

బొజ్జలా.. దేవుడు క్షమించడు

- మీ ఇంటి పక్కనున్న ఆలయాన్నే పట్టించుకోలేదు
- 30 ఏళ్లుగా నిరాదరణకు గురైన నీలకంఠేశ్వరస్వామి ఆలయం
- నేడు అట్టహాసంగా ఆలయ పునరుద్ధరణ
- వైభవంగా మహాకుంభాభిషేకం
- పాల్గొన్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


ఊరందూరు నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాషేక మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం వేదోక్తంగా నిర్వహించారు. వేదపండితులు ఆలయంలో హోమ పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ కలశాలకు పూజలు చేశారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో కలియదిరుగుతూ శిథిలావస్థలో ఉన్న ఆరుద్రగుడిని సైతం పునరుద్ధరించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినా తన ఇంటి పక్కనున్న ఆలయాన్నే బొజ్జల కుటుంబం విస్మరించిందని, దేవుడు కూడా క్షమించడని ఆయన ధ్వజమెత్తారు.

నాటి వీరక్షేత్రపురమే నేటి ఊరందూరు

చొళుల కాలంలో వీరక్షేత్రపురం (నేటి ఊరందూరు)లో నీలకంఠేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. నీలకంఠుడు అనే రుషి శివయ్య కోసం ఘోర తపస్సు చేయగా.. అతని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమని సూచించారు. నువ్వు ఇక్కడ వెలవాలి అని చెప్పగా.. ఇక్కడే సమీపంలో నేను కొలువయ్యాను.. నీ కోరిక మేరకు నా పుట్టిన రోజు ఆరుద్ర నక్షత్రం నాడు ఇక్కడకు వస్తాను అని శివయ్య సెలవిస్తారు. ఇంతటి చరిత్ర ఉన్న ఆలయాన్ని బొజ్జల కుటుంబం విస్మరించడం స్థానికులను బాధిస్తోంది.

రూ.50 లక్షలతో ఆలయ పునరుద్ధరణ

దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్వగ్రామం ఊరందూరులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణకు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. శిథిలావస్థకు చేరి, వర్షమొస్తే మునిగిపోయే ఈ ఆలయ రూపురేఖలు మార్చాలని నిశ్చయించారు. ఈ క్రమంలో రూ.50 లక్షలు వెచ్చించి ఆలయాన్ని పునరుద్ధరించారు. శుక్రవారం వేదోక్తంగా మహాకుంభాభిషేకాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారు. మరో రూ.20 లక్షలతో పక్కనే ఉన్న ఆరుద్ర మండపాన్ని కూడా పునరుద్ధరించాలని ఆలయ అధికారులకు సూచించారు.

ఇంటి పక్కనున్న ఆలయాన్నే పట్టించుకోరు

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊరందూరులో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. 30 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న బొజ్జల కుటుంబం ఏనాడూ తమ సొంత గ్రామంలో ఉన్న ఆలయాన్ని పట్టించుకోలేదన్నారు. ఇంటి పక్కన ఉన్న ఆలయానికి మహాకుంభాభిషేకం నిర్వహించకుండా స్వామివారిని అవమానించారని ధ్వజమెత్తారు. తాను పార్టీలను పక్కన పెట్టి స్వామివారు బాగుంటే, ఊరు బాగుంటుందనే ఉద్దేశంతో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్‌తో కలిసి మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించినట్లు తెలిపారు. స్థానికంగా ఎల్లమ్మ ఆలయానికి కూడా రూ.50 లక్షలతో పునర్నిర్మాణం చేపట్టనున్నట్టు వెల్లడించారు. దేవుళ్లను నిర్లక్ష్యం చేసి బొజ్జల కుటుంబం పాపాలను మూటగట్టుకుందని ఎద్దేవా చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మునిచంద్రరెడ్డి, హరిరెడ్డి, రంగయ్య, దిలీప్, నవీన్, సాయి, నేతాజీ, మురళి, శివ, భరత్, హరీష్, నీలకంఠారెడ్డి, చంద్ర, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా.. పట్టణంలోని ఈటీసీ కేంద్రం వద్ద ఉన్న శివాలయంలో, దుర్గేశ్వరస్వామి ఆలయాల్లో కూడా మహాకుంభాభిషేకం నిర్వహించారు.


ఆలయ కలశానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,275 మంది స్వామివారిని దర్శించుకోగా 25,292 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.07 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వృద్ధురాలి ఆత్మహత్య

వాకాడు: వాకాడు మండలం ఓడపాళెం సవక తోటలో గురువారం ఓ వృద్ధురాలు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం మేరకు చిట్టమూరు మండల కేంద్రానికి చెందిన గోను చెంగమ్మ(65) కుటుంబ కలహాల కారణంగా సముద్ర తీర ప్రాంతానికి వెళ్లి చెట్టుకు తన చీరతో ఉరేసుకుని మృతి చెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


మృతుడు గిరిధర్‌రెడ్డి (ఫైల్)

చిల్లకూరు: జాతీయ రహదారిపై బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో బైక్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం పట్రగుంట సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు దుగ్గిరాల మండలం, నంబూరు గ్రామానికి చెందిన గిరిధర్‌రెడ్డి (22) తడలోని శ్రీ సిటీలోని డైకాన్ ఏసీల తయారీ యూనిట్‌లో క్వాలిటీ కంట్రోల్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను బైక్‌పై సహోద్యోగితో కలసి పని మీద నెల్లూరుకు బయల్దేరారు. పట్రగుంట సమీపంలో నాయుడుపేట నుంచి వస్తున్న లారీ ఢీ కొనడంతో గిరిధర్‌రెడ్డి లారీ వెనక చక్రాల కింద పడి మృతి చెందాడు. వెనుక కూర్చున్న యువతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు యువతిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

19న జిల్లాకు స్టాండింగ్ కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: జిల్లాకు ఈనెల 19న విచ్చేస్తున్న స్టాండింగ్ కమిటీ పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, అదనపు ఎస్పీ కులశేఖర్‌తో కలిసి గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ హోం అఫైర్స్ బృందం ఆన్‌ది స్పాట్ విపత్తు నిర్వహణపై అధ్యయనం కోసం వస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కమిటీ బృందం ప్రముఖ పుణ్య క్షేత్రమైన తిరుమల శ్రీవారి ఆలయం ఆన్‌ది స్పాట్ విపత్తు నిర్వహణపై స్టడీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పార్లమెంటరీ కమిటీ బృందానికి రాజ్యసభ ఎంపీ బ్రిజ్‌లాల్ సారథ్యం వహిస్తున్నట్లు వెల్లడించారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి

రోడ్లు మరియు భవనాల శాఖ, నీటి పారుదల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, ఇరిగేషన్ శాఖపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ వార్డు సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ పనులకు సంబంధించిన బిల్లులను త్వరగా అప్లోడ్ చేసి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు భాస్కర్ నాయుడు, రాంమోహన్, డీఎఫ్‌ఓ రమణయ్య, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా పర్యాటక, రవాణా శాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో 31 కేసుల నమోదు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని సూపర్ మార్కెట్, కూల్ డ్రింక్స్, డీమార్ట్, రిలయన్స్, ఎల్‌పీజీ డీలర్స్, పెట్రోల్ బంకులు, రైతు బజార్, వెజిటబుల్ మార్కెట్, పలు షాపింగ్ మాల్స్‌లో తూనికలు కొలతల శాఖ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 31 కేసులు నమోదు చేసినట్లు తూనికలు, కొలతలశాఖ తిరుపతి అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి తెలిపారు.

ఇది పూర్వ జన్మసుకృతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా పని చేయడం తన పూర్వజన్మ సుకృతమని బదిలీపై వెళుతున్న కేఎస్ రామారావు అన్నారు. ఆయన గురువారంమాట్లాడుతూ శ్రీకాళహస్తి క్షేత్రం ఎంతో మహమాన్వితం గల క్షేత్రం అని చెప్పారు. తన తండ్రి మరణించిన సమయంలో సిబ్బంది చూపిన ఆప్యాయత మరువలేమన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తనను ఎంతగానో ఆదరించన్నారు.

స్నేహితుడే యముడు

- మల్లంగుంటలో వడ్డీవ్యాపారి హత్య

తిరుపతి రూరల్: పాతకక్షల నేపథ్యంలో ఫైనాన్షియర్‌ను స్నేహితుడే హతమార్చిన సంఘటన గురువారం మండల పరిధిలో వెలుగుచూసింది. తిరుపతి రూరల్ సీఐ హమీమ్ అహ్మద్ కథనం మేరకు, తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన నిరంజన్(33) తిరుపతి, తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన స్నేహితులతో కలిసి గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లంగుంట శ్మశానం వద్ద మద్యం తాగాడు. సాయంత్రం 5 గంటల సమయంలో చీటీ డబ్బులు ఇచ్చేందుకు నిరంజన్ తిరుపతికి వెళ్లి వచ్చాడు. మళ్లీ 5.30 గంటల సమయంలో స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో మల్లంగుంటకు చెందిన సోము కత్తితో వచ్చి నిరంజన్‌ను నరికి చంపాడు. విచక్షణా రహితంగా నిరంజన్ శరీరం, తలపై కత్తితో నరికాడు. దీంతో నిరంజన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు, హంతకుడు ఇద్దరూ కూడా గతంలో స్నేహితులే కావడం గమనార్హం.

దీపావళి సందర్భంగా ఘర్షణ

గత దీపావళి సందర్భంగా దుర్గసముద్రం టపాసుల గోడౌన్ సమీపంలో జరిగిన ఘర్షణలో నిరంజన్, సోము బద్ధశత్రువులుగా మారారు. కేసు నేపథ్యంలో సోము జైలుకు వెళ్లి గత కొద్ది రోజుల క్రితమే బయటకు వచ్చాడు. తాను జైలుకు పంపడంలో నిరంజన్ హస్తం ఉందన్న కోపంతో కత్తితో నరికి చంపినట్లు ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపారు. స్థానికుల సమాచారంతో తిరుపతి రూరల్ సీఐ హమీమ్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకున్నాడు. నిరంజన్ మృతదేహాన్ని పోస్టుమార్టం తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ హమీమ్ అహ్మద్ తెలిపారు. నిందితుడు సోము పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తప్పనిసరిగా స్కౌట్ అండ్ గైడ్ యూనిట్ ప్రారంభించాలని జిల్లా కమిషనర్ ఎంఎం రెడ్డి, కార్యదర్శి జయరాం అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్, డీఈవో వి.శేఖర్ ఆదేశాల మేరకు తిరుపతి స్కౌట్స్ జిల్లా ఆధ్వర్యంలో పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో బిగినర్స్ కోర్సులో శిక్షణ ఇచ్చారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీ పురం, తడ మండలాల నుంచి 230 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఎంఈవో భువనేశ్వరి మాట్లాడుతూ ప్రతి పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ ప్రారంభించేందుకు చొరవ చూపాలన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ శాఖ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ గిరిజన గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని నెల్లూరు ఐటీడీఏ పీవో మందారాణి గురువారం తెలిపారు. రేణిగుంట, కేవీపల్లి, గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి, 6 నుంచి 9 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖాళీలను పరిశీలిస్తే రేణిగుంట స్కూల్లో ఐదో తరగతికి మొత్తం 80 సీట్లు ఉండగా, అందులో ఎస్టీ 59, ఎస్టీ (పీహెచ్‌సీ) -01, పీటీజీ-01, ఓసీ-02, ఎస్సీ-10, బీసీ-04, ఏఈక్యూ- 02 సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. అలాగే 6వ తరగతిలో 39, 7వ తరగతిలో 08, 8వ తరగతిలో 03, 9వ తరగతిలో 12 సీట్లు ఖాళీలున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు మొత్తం 80 సీట్లుండగా, వాటిలో ఎస్టీ 59, ఎస్టీ (పీహెచ్‌సీ) -01, పీటీజీ-01, ఓసీ-02, ఎస్సీ-10, బీసీ-04, ఏఈక్యూ- 02 సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. 6వ తరగతి- 10, 7వ తరగతి- 00, 8వ తరగతి -00, 9వ తరగతి- 06 సీట్లు ఖాళీలున్నాయన్నారు. కేవీ పల్లి స్కూల్లో 5వ తరగతి ప్రవేశాలకు మొత్తం 80 సీట్లుండగా, వాటిలో ఎస్టీ 59, ఎస్టీ (పీహెచ్‌సీ) -01, పీటీజీ-01, ఓసీ-02, ఎస్సీ-10, బీసీ-04, ఏఈక్యూ- 02 సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. అలాగే 6వ తరగతిలో 64, 7వ తరగతిలో 46, 8వ తరగతిలో 45, 9వ తరగతిలో 49 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు దరఖాస్తులను www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ నందు సమర్పించాలన్నారు. ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమాధికారి(94926 06731), రేణిగుంట స్కూల్ ప్రిన్సిపల్ (94410 40199), శ్రీకాళహస్తి ప్రిన్సిపల్(98666 62515), కెవి పల్లి ప్రిన్సిపల్ (94909 80563) నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

తిరుపతిలో గంజాయి స్వాధీనం ముగ్గురి అరెస్టు

తిరుపతి(అలిపిరి): తిరుపతి జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశాల మేరకు సెబ్ అధికారులు గురువారం దాడులు చేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత తిరుచానూరు రోడ్డులో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం గేటు వద్ద తిరుపతి అర్బన్ సెబ్ సీఐ తమ సిబ్బందితో దాడులు చేసి, గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి పట్టణం దామినేడుకు చెందిన రజాక్, నుంచి 1.2 కిలోల గంజాయి, పార్వతీపురానికి చెందిన రవితేజ నుంచి 1.1కిలోలు, కొరమీనుగుంటకు చెందిన మునిరాజమ్మ నుంచి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ముగ్గురిలో పార్వతీపురానికి చెందిన రవితేజపై గతంలో రెండు కేసులు ఉన్నాయి. 2023 నవంబర్‌లో ఇదే తరహా నేరంపై రెండు నెలలు జైలు శిక్ష, 2021లో చంద్రగిరి పరిధిలో ఇదే తరహా నేరంలో నెలరోజులు జైలు శిక్ష అనుభవించాడు. మునిరాజమ్మ గంజాయి కేసులో గతంలో మూడు నెలల జైలు శిక్ష అనుభవించింది. దాడుల్లో తిరుపతి అర్బన్ సీఐ సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ స్వామినాథన్, హెడ్ కానిస్టేబుళ్లు మనోహర్, సుధాకర్ రాజు, కానిస్టేబుళ్లు చిరంజీవి, శోభా రాణి పాల్గొన్నారు.